# శ్రీ సాయి అనుగ్రహ మాలిక

## సర్వం శ్రీసాయి సేవా ట్రస్ట్

Regd. 192/2019



సర్వం శ్రీసాయి

శ్రీ సాయి అనుగ్రహ మాలిక :

సాయి నామమే పవిత్రం ! సాయి బోధలే విచిత్రం !

సాయి పాదమే పవిత్రం ! సాయి పలుకులే విచిత్రం || సాయి నామమే !!!

కలరా వ్యాధి కాఠిన్యమ్ ! గోధుమపిండి ఔషధం !

హేమాద్పంతుకి ఆశ్చర్యం ! పలికించెనులె సచ్చరితం ||

పెళ్ళికి వచ్చెను ఒక బృందం ! మహాల్సా నోటిలో ఒక మంత్రం !

సాయి అనే పావనమంత్రం ! జగతికి ఇదియే ఆధారం ||

శ్రీరామనవమి సంభరం ! ఉర్సు చందన ఉత్సవం !

ముస్లిం హిందూ సహవాసం ! జాతికి ఎంతో ప్రీతికరం ||

బాబా చేసెను అద్భుతం ! ప్రేగులనే పరిశుభ్రం !

ఖండం చేసెను శరీరం ! అది పాపాలకు పరిహారం ||

గాలించెనులె బయజా అరణ్యం ! పెట్టెను ప్రేమతో నైవేద్యం !

బాబా ఇ చ్చెను ఒక వరం ! తాత్యాకిచ్చేను తన ప్రాణం ||

బల్లపై విచిత్ర శయనం ! గుడ్డముక్కల ఆధారం !

చూసినవారికి పరవశం ! తలపించేనులే అది వైకుంఠమ్ ||

గణు మదిలో సంకల్పం ! ప్రయాగ తీర్థ ప్రయాణం !

బాబా చూపెను మహత్యం ! గంగాయమునల సంగమం ||

రాధా భాయి ఉపవాసం ! కావాలన్నది ఒక మంత్రం !

బాబా చూపెను గురు మార్గం ! ఆమెకు కల్గెను మరిజ్ఞానం ||

దుకాణదారుల  అజ్ఞానం ! నూనె లేదని అబద్ధం !

నీ ళ్ళ ను నూనెగా పోయడం ! షిర్డీ అంతా కాంతిమయం ||

వ్రాయాలని గణు ఒక బాష్యం ! కాకా ఇంటిలో శ్రీకారం !

నౌకరు పిల్లతో బో ధనం ! జగతికి ఈశా వాస్యం ||

దాము అన్న వ్యాపారం ! బాబా వద్దనే ఆ భేరం !

తొలగించేనులే మరి లోభం ! అదియే ముక్తికి సోపానం ||

నానా మనసులో సందేహం ! పసిగట్టేను బాబా చిరుగర్వమ్ !

బో ధించేనులే గీతా రహస్యం ! కదిలేను ఆతని హృదయం ||

కుమ్మరి వనిత పరద్యానం ! కొలిమిలో బిడ్డకు అపాయం !

బాబా చూపెను కారుణ్యం ! అది ఆమెకు మమతావేశం ||

వచ్చెను మైనకు ఒక గండం ! మూడు దినముల వేదనం !

జామ్నేరులో బాబా చమత్కారం ! కల్గెను ఆమెకు సుఖప్రసవం ||

మేఘా చూసేను ఒక స్వప్నం ! కనిపించెనులే త్రిశూలం !

బాబా పంపెను శివలింగం ! ద్వారకమాయే కైలాసం ||

వణిలో కాకా కలవరం ! సప్తశృంగి సందేశం !

బాబా కోసం పరితాపం ! చివరికి కల్గెను అనుగ్రహం ||

షిర్డీ వాసుల కలకలం ! తుఫాను తాకిడి బీభత్సమ్ !

బాబా ఇచ్చెను ఆదేశం ! అప్పుడు అంతా ప్రశాంతం ||

మహాల్సా పల్లకి పయనం ! బంధిపోట్ల విహారం !

జిజూరిలొ బాబా దర్శనం ! కష్టాలన్నీ మటుమాయం ||

సాయి నోటిలో ఒక కథనం ! పాము కప్పల జీవనమ్ !

మానవ జన్మల రహస్యం ! లోకానికిదియే ఆధారం ||

ఇచ్చెను బాబా ఒక దానం ! అది లక్ష్మిబాయి సుకృతం !

నవవిధి భక్తీ విధానం ! ఇదియే కలియుగ ధర్మం ||

ఇటుక రాయితో సంకేతం ! మహాసమాధి సన్నాహం !

బూటి వాడలో నివాసం ! అదియే మనకు పరమపదం ||

సాయి నామమే పవిత్రం ! సాయి బోధలే విచిత్రం !

సాయి పాదమే పవిత్రం ! సాయి పలుకులే విచిత్రం ||

::సాయినామ స్మరణ::

శ్రీ సాయితత్వం మానవ జన్మకు ఈ భూమిపైనే చరితార్థం చేయగల శక్తిపాతం. 'సాయి' నామం పావన మంత్రం. అదొక అమృత గుళిక. సాయిలీలామృతాన్ని ఒడిసిపట్టి తాగిన వారు ధన్యులు.

సాయి సచ్చరిత్ర సముద్రమంత లోతైనది. ఆకాశమంత విశాలమైనది. భక్తి, జ్ఞానమనే మణులు అందులో దాగి ఉన్నాయి.

ఎవరెంత లోతుకు వెళ్ళగలిగితే అన్ని మణులను, రత్నాలను పొందవచ్చు. వీటిని పొందాలంటే మనలోని అహంకారాన్ని తీసి బాబా పాదాలపై పెట్టాలి.

శ్రద్ధ, సహనం....దక్షిణగా సమర్పించాలి. సాయి సచ్చరిత్రలోని ఒక్కో సత్కథ ఒక్కో సద్గతి కలిగిస్తుంది. బాబా చాటిన నీతి, ఉపదేశాలు జీవనరీతుల్ని నేర్పుతాయి.

బాబా లీలలు ఆశ్చర్యానందాలను కలిగిస్తాయి. అవి చదివినంతనే మనో వికారాలు ఎగిరిపోయి శాంతి ఆవరిస్తుంది. బాబా జీవన విధానం మనకు బుద్ధిని, జ్ఞానాన్ని అలవరుస్తుంది. ఇక, బాబా చెబుతున్నదేమిటో ఆలకిద్దాం.

"అహంకారాన్ని విడిచి నా పాదాలపై పెట్టండి. వారికి నేను మిక్కిలి సాయపడతాను. వారి జీవిత చర్యల్లోను, గృహకృత్యాల్లోనూ తోడునీడగా ఉంటాను.

అహంకారం మీ మనస్సులో మచ్చుకైనా లేని రోజున మీ హృదయాల్లోనే శాశ్వతంగా కొలువుండిపోతాను. నా లీలలు, బోధలు విన్న, ఆచరించిన భక్తులకు భక్తి, విశ్వాసాలు కుదురుతాయి. వారు

ఆత్మసాక్షాత్కారాన్ని, బ్రహ్మానందాన్ని పొందుతారు. నా నామాన్ని ప్రేమతో స్మరించే వారి కోరికల్ని తీరుస్తాను. వారిలో, భక్తి, జ్ఞాన వికాసాన్ని కలిగిస్తాను.

ఎవరైతే మనఃపూర్వకంగా నా బోధనల్లోని విషయాలను గ్రహిస్తారో వారు సంతోషగ్రస్తులవుతారు. నన్నే స్మరించి, ధ్యానించి, పూజించే వారిని జనన మరణ బంధాల నుంచి బయట పడవేస్తాను.

భక్తి శ్రద్ధలతో నా లీలల్ని చదవండి. మనసులో నిలుపుకోండి. ఉపదేశాలను ఆచరించండి. అప్పుడు గర్వం, అహంకారం నశిస్తాయి.

ఆనందానికి, తృప్తికి ఇదే మార్గం. 'సాయి...సాయి' అనే నామ స్మరణ వల్ల చెడు వినుట, చెడు పలుకుత వలన కలిగే పాపాలు పటాపంచలైపోతాయి.

నా మాటలపై నమ్మకం ఉంచిన వారు తరిస్తారు. మనసు చెదిరిపోనీయకండి. దేనికీ భయపడకండి. చలించకండి. స్థిరంగా, విశ్వాసంతో ఉండండి. నా లీలలు చదవటం కాదు, వాటిలోని నీతిని, మంచిని గ్రహించి ఆచరించటం ముఖ్యం."